ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5 ı కనిష్ఠం 21.3

నిజామాబాద్

జిల్లా వార్తలు

5

శనివారం 5 అక్టోబరు 2024





• ర్యాలీగా వస్తున్న టీ పీసీసీ అధ్యక్షుడు



• సభలో మాట్లాడుతున్న మహేష్ కుమార్ గౌడ్



వేదికపై అభివాదం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ



• బహిరంగ సభకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

జిల్లా అభివృద్ధికి కృషి

- మెడికల్ కళాశాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి
- పనిచేసే కార్యకర్తలందరికీ అవకాశాలు
- డీఎస్సే నా రాజకీయ గురువు
- కాంగ్రెస్ కీలక అవకాశాలను కల్పించింది
- సన్మాన సభలో టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీ పీసీసీ అధ్యక్షుడి హోదాలో జిల్లాకు చెందిన నేతలందరినీ కలుపుకొని జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అన్ని వర్గాల వారికి అభివృద్ధి ఫలాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. మంత్రుల సహకారం తీసుకొని పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తానన్నారు. తాను జిల్లాకు చెందిన వ్యక్తి కాబట్టి తనపై ప్రజలు ఎక్కువగా ఆశలు పెట్టుకుంటారని వాటికి అనుగుణంగా పనులు చేస్తానన్నారు. శుక్రవారం నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నాగన్న చెరువు నుంచి నయా ఢిల్లీ వరకూ.. నా ప్రయాణాన్ని ఎప్పుడైనా ఊహించారా.. ఎలాంటి వసతులు లేని చిన్న గ్రామం రహమత్‌నగర్ నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగాను. రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన తనకు పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చింది' అని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. కరాటే మాస్టర్‌గా ఉన్న తనకు డీఎస్ పిలిచి ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నో ఏళ్లు కష్టపడి పనిచేసి ఆటుపోట్లను కూడా ఎదుర్కొన్నానని అన్నారు. డీఎస్‌ను కూడా కొన్నిసార్లు విభేదించానన్నారు. తనకు పదవి వస్తే ఆయనను కలవాలనుకున్నా, కానీ ఆయన మన మధ్య లేక పోవడం బాధాకరమని అన్నారు. నక్సల్ ప్రభావంతో ఊరు విడిచి నిజామాబాద్‌కు వచ్చిన తన కుటుంబం రాజకీయ నేపథ్యం లేకున్నా కాంగ్రెస్ పార్టీలో చేరిన తనకు చాలా అవకాశాలు ఇచ్చారని అన్నారు. తాను పుట్టిన ఊరు నుంచి ఢిల్లీ వరకు పనిచేసే అవకాశాన్ని పార్టీ నేతలు కల్పించారని అన్నారు. కాంగ్రెస్ నేతలు, గాంధీ కుటుంబంతో ఉన్న అనుబంధం వల్ల తనకు ఈ పదవి వచ్చిందన్నారు. అవకాశాలతో పాటు భగవంతున్ని ఆశీస్సులు, తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తోడు కావడంతో తాను ఈ పదవికి ఎంపిక య్యానని అన్నారు.

జిల్లాలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి

జిల్లాలో ప్రాణహిత చేవెళ్లకు చెందిన ప్యాకేజీ 21 పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూస్తానన్నారు. జిల్లాలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఈ కళాశాలతో పాటు విద్య కోసం మరికొన్ని కళాశాలలను ఏర్పాటు అయ్యే విధంగా చూస్తామన్నారు. ఒకనాడు జిల్లాలో ఎన్నో పరిశ్రమలు పని చేశాయని అన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీతో పాటు సహకార చక్కెర కర్మాగారం, ఇతర పరిశ్రమలు ఉండేవన్నారు. గత ప్రభుత్వం హయాంలో అవి మూతపడ్డాయని అన్నారు. జిల్లాలో పరిశ్రమలు మళ్లీ పూర్వవైభవం వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు వచ్చే విధంగా చూస్తామన్నారు. జిల్లాలో వనరుల వినియోగంతో పాటు ఉపాధిని కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతో పాటు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పిస్తామన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు వ్యవసాయంలో మరింత ముందుకు వెళ్లే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. అందరూ పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు తగిన న్యాయం చేస్తుందని అవకాశాలను కల్పిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంత్‌రావు అన్నారు. పార్టీలో చిత్తశుద్ధితో పనిచేస్తే ఎంతో ఎత్తుకు ఎదగవచ్చన్నారు. రాజకీయాల్లో తగిన అవకాశాలు కాంగ్రెస్ పార్టీనే కల్పిస్తుందని మాజీ క్రికెటర్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారొద్దీన్ అన్నారు. క్రికెట్‌లో రాణించిన తనకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు. జిల్లాలో ఎంతో మంది క్రియాశీలమైన నేతలు ఉన్నారని వారందరి ఆధ్వర్యంలో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎక్కువగా ఎన్నికయ్యే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ పదవులతో పాటు అన్నింటిలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తగిన అవకాశాలు ఇవ్వాలన్నారు. వారికి 90 శాతం పదవులను కల్పించాలని ఆయన కోరారు. జిల్లాతో తన అనుబంధం విడదీయనిదని మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. జిల్లా ప్రజలు తనను రెండు సార్లు ఆదరించి ఎంపీగా గెలిపించారని అన్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ నుంచి సోనియా గాంధీ వరకు తనకు అవకాశాలు ఇచ్చారని అన్నారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ కోసం నిజామాబాద్‌లోని మెడికల్ కళాశాలకు ఆమె పేరు పెట్టాలని ఆయన కోరారు. జిల్లాలో పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దెబ్బతిందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. వారి పాలనలో అభి వృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడిన తర్వాతనే అన్నీ సరిచేస్తూ అవకాశాలను ఇస్తున్నామన్నారు. పోస్టులను భర్తీ చేయడంతో పాటు పథకాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోనే అందరికి అవకాశాలు వస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. పూర్తిస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పదవులను ఇవ్వడంతో పాటు పేదల కోసం పనిచేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, సురేష్ శెట్కార్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, మార గంగారెడ్డి, ఈరవత్రి అనిల్, కాసుల బాల్‌రాజు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పార్టీ నేతలు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, రోహన్‌రెడ్డి, మార చంద్రమోహన్‌రెడ్డి, ఏబీ శ్రీనివాస్ (చిన్న), పోచరం భాస్కర్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి, ఇర్ఫాన్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

సన్మాన సభ సక్సెస్..

నగరంలో నిర్వహించిన పీసీసీ అధ్యక్షుడి సన్మాన సభ విజయవంతమైంది. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సన్మాన సభ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేయగా అన్ని నియోజకవర్గాల నుంచి సీనియర్ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డితో పాటు పలువురు నేతలు ఏర్పాట్లలో పాలుపంచుకున్నారు. సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా నేతలతో పాటు కార్యకర్తలు తరలివచ్చారు. సభ సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. సభ విజయవంతం కావడంతో పార్టీ నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు..

నిజామాబాద్ అర్బన్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులై మొదటిసారి జిల్లాకు వచ్చిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. జిల్లా సరిహద్దు చంద్రయాన్‌పల్లి నుంచి మొదలుకొని జిల్లా కేంద్రం వరకూ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఇందల్వాయి టోల్‌గేట్ దగ్గర జిల్లాకు చెందిన నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి వాహనాల ర్యాలీ.. డిచ్‌పల్లి, ధర్మారం మీదుగా మాధవనగర్‌కు చేరుకుంది. మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఓపెన్ టాప్ వాహనంలో మహేష్‌కుమార్‌గౌడ్, ఇతర నేతలు రాగా పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. మాధవనగర్ నుంచి బోర్గాం(పి), వినాయక్‌నగర్, పూలాంగ్ మీదుగా ర్యాలీ పాత కలెక్టరేట్‌కు చేరుకుంది. ఈ ర్యాలీలో గుర్రాలు, ఒంటెలతో విన్యాసాలు నిర్వహిస్తూ ప్రత్యేక స్వాగత కార్యక్రమాలను నిర్వహించారు. అడుగడుగునా నేతలు పూలమాలలు వేస్తూ సన్మానాలు చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఓపెన్‌టాప్ వాహనం నుంచి మహేష్‌కుమార్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఘనస్వాగతం లభించగా పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మూడు రోజులుగా స్వాగత సభను విజయవంతం చేసేందుకు జిల్లాకు చెందిన నేతలు తీవ్రంగా శ్రమించారు. ర్యాలీలో వర్దన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, నగర అధ్యక్షుడు కేశవేణు, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌గౌడ్‌తో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తదితరులు

హెలికాప్టర్‌లో మహేష్‌గౌడ్ కుటుంబీకుల రాక

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ స్వాగత సభ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీతో పాటు మహేష్‌కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక హెలికాప్టర్‌లో నగరానికి చేరుకున్నారు. మంత్రులు సైతం జిల్లా కేంద్రానికి హెలికాప్టర్‌లో వచ్చారు. టీ పీసీసీ అధ్యక్షుడిగా మొదటి సారి జిల్లాకు వచ్చిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు జిల్లా సరిహద్దులోని చంద్రయాన్‌పల్లి వద్ద మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు ఆకుల లలిత రాఘవేందర్, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. బంజారా సంప్రదాయ నృత్యాలతో మహిళలు మహేష్‌గౌడ్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మండవ గృహంలో మంత్రి తుమ్మల..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధర్మారం (బి)గ్రామంలోని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లారు. మండవ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గ్రూప్ ఫొటో దిగారు. టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మొదటిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయనతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాకు వచ్చారు. ఈ క్రమంలో ధర్మారంలోని మండవ ఇంటిని సందర్శించారు. - డిచ్‌పల్లి



మండవ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మంత్రి తుమ్మల

దసరా కానుకగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో అర్హులను ఎంపిక చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా ప్రగతిపై కలెక్టరేట్‌లో మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, కొండా సురేఖ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 4: జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను విజయదశమి కానుకగా అర్హులైన వారికి కేటాయించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో అర్హులను ఎంపిక చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తుందన్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుతీరుపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు శుక్రవారం సమీక్ష జరిపారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న మంత్రులకు హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల ప్రగతి, ఎల్ఆర్ఎస్, విద్య, వైద్య, ఆరోగ్య శాఖల పనితీరు, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ సర్వే తదితర అంశాలపై కలెక్టర్ మంత్రుల దృష్టికి తెచ్చారు. అర్హులైన వారికి తొలి విడతగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వం త్వరలో 3500 నుంచి 4వేల ఇళ్లను మంజూరు చేయనుందన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ కారణంగా రైతులు అభద్రతా భావానికి గురయ్యారని మేధావులు, నిపుణులు, అన్ని వర్గాల వారిని సంప్రదించిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. రెవెన్యూ చట్టాల్లో మార్పులు చేయాలనుకునే ఇతర రాష్ట్రాలకు ఈయాక్ట్ ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా ఉపయోగపడుతుందన్నారు. సమీక్షలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి పునర్వైభవం తీసుకొస్తాం

• గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నిర్వీర్యం • ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం



జెండా ఊపుతున్న మంత్రి పొన్నం, అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు

సుభాష్‌నగర్, అక్టోబరు 4: ఆర్టీసీకి పునర్వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులను మంత్రి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల్లో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రభుత్వంలో మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఈ పథకం అనంతరం కొత్త బస్సులను, కొత్త నియామకాలను చేపట్టామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా 95కోట్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి 3500 కోట్ల రూపాయలు సంస్థకు రాబడి జరిగిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం ప్రభుత్వం 2013 పీఆర్‌సీని, ఇతర సౌకర్యాలను ఇవ్వడం జరిగిందన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రికార్డు స్థాయిలో మహిళలు ఆర్టీసీలో ప్రయాణించారని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో నూతన బస్సులను ప్రవేశపెడుతున్నామని అన్నారు. గ్రామ గ్రామాన ఆర్టీసీని విస్తరించేందుకు నూతనంగా బస్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతీ గ్రామంలో ఆర్టీసీ బస్సు నడుస్తుందన్నారు. పెరుగుతున్న కాలుష్యానికి అనుగుణంగా ఆర్టీసీలో కాలుష్య నియంత్రణ కోసం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టామని తెలిపారు. హైదరాబాద్ తర్వాత నిజామాబాద్‌లోనే ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టామన్నారు. నిజామాబాద్‌కు మొత్తం 67ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించగా ప్రస్తుతానికి 13బస్సులు ప్రారంభించామన్నారు. మిగతా బస్సులను త్వరలోనే నిజామాబాద్‌కు పంపిస్తామన్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్‌కు ప్రయాణించవచ్చన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు చాలా సురక్షితమైనవని ఒక్కసారి చార్జ్ చేస్తే 300 కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, ఈడీ మునిశేఖర్, ఆర్ఎం జానిరెడ్డి, డీవీఎంలు శంకర్, సరస్వతి, డిపో మేనేజర్లు ఆనంద్, సాయన్న, శ్రీనివాస్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటయ్య, పక్కన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 4: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌ల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయా సమస్యలపై బాధితుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్ని రకాల పెండింగ్ కేసులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని అవసరమైతే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసుకొని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో గడిచిన మూడు నాలుగు దశాబ్దాలుగా గ్రామాభివృద్ధి కమిటీలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయని గ్రామాల అభివృద్ధి కోసం వీడీసీలు కృషి చేయాలని ఎవరూ కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఏమాత్రం ఉపేక్షించేదిలేదన్నారు. అలాంటి గ్రామాభివృద్ధి కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్, సీపీలకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లలో ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురిచేసే అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తుందన్నారు. ప్రతినెలా చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతీ మూడు నెలలకోసారి తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. కలెక్టర్, సీపీలు చక్కగా పనిచేస్తున్నారని జిల్లా ప్రజల్లో మంచి పేరు ఉందన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి 41 సీఆర్‌పీ కింద పోలీస్ స్టేషన్‌లకు పిలిపించుకొని స్టేషన్ బెయిల్ ఇవ్వడం వల్ల అట్రాసిటీ చట్టం నీరుగారిపోయే ప్రమాదం ఉందని చైర్మన్ అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఇప్పటికే సీఎంతో చర్చించామని ఈనెలాఖరులో ఢిల్లీ వెళ్లి కేంద్ర సాంఘిక సంక్షేమ, న్యాయ శాఖ మంత్రులను కలిసి విన్నవిస్తామన్నారు. ఈ సమక్షీలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, రేనిగుంట ప్రవీణ్, నీలాదేవి, శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఎస్‌డీవో నిర్మల, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్కోరలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్, అక్టోబరు 4: వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గొర్రెపల్లి స్వామికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

గన్యతండాలో పరామర్శ

జక్రాన్‌పల్లి, అక్టోబరు4: మండలంలోని గన్యాతాండా గ్రామంలో పలు కుటుంబాలను శుక్రవారం ట్రైస్ చైర్మన్ బెలాయ్యనాయక్ పరామర్శించారు. ఆయన వెంట లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, గిరిజన నాయకులు, గన్యతాండా గ్రామస్థులు ఉన్నారు.

జార్కండ్ బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

కోటగిరి,అక్టోబరు 4: మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో గల గుమ్మడి ఫౌండేషన్‌లో జార్కండ్ బాలుడు వీర్‌కుమార్‌ను శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రంలోని సాహబ్ గంజి జిల్లా మహరాజపూర్ గ్రామానికి చెందిన వీర్‌కుమార్ వారం రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయాడు. పాఠశాలకు వెళ్లాల్సిన వీర్‌కుమార్ గంగానది వద్దనే ఉంటూ కాలక్షేపం చేస్తుండడంతో తల్లి సవితాదేవి మందలించింది. వీర్ కుమార్ ఇంటి నుంచి పారిపోయి కలకత్తా మీదుగా సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వచ్చి బోధన్‌కు చేరుకున్నాడు. ఆదివారం బోధన్ సంతలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు పట్టుకుని బాలల సంరక్షణ అధికారికి సమాచారం అందించారు. ఆదివారం రాత్రి బాలుడిని ఎక్లాస్‌పూర్‌లోని గుమ్మడి ఫౌండేషన్‌కు తరలించారు. మూడురోజుల పాటు బాలుడితో మాట్లాడుతూ వివరాలు రాబట్టారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తల్లి సవితాదేవి శుక్రవారం బాలల సంరక్షణ అధికారిని కలుసుకుంది. గుమ్మడి ఫౌండేషన్‌లో ఉన్న బాలుడిని చూసి కన్నీటిపర్యాంతం అయింది. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బోధన్‌రూరల్, అక్టోబరు 4: మండలంలోని అమ్దాపూర్, ఊట్‌పల్లి, బెల్లాల్, రాజీవ్‌నగర్ తండా తదితర గ్రామాలలో గురువారం రాత్రికురిసిన భారీ వర్షానికి వరిపంట నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. అమ్దాపూర్ బీజేపీ నాయకులు పంట పొలాలను పరిశీలించి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు రైతులను ఆదుకోవాలని కోరారు.

● వర్ని, చందూర్‌లో వర్ష భీభత్సం

వర్ని: వర్ని, చందూర్ మండలాల పరిధిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చేతికొచ్చిన వరిపంట నేలకొరిగింది. వందలాది ఎకరాల్లో పంట దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటూ బోరున విలపిస్తున్నారు. జాకోరా, జలాల్‌పూర్, సత్యనారాయణపురం, పాత వర్ని, శ్రీనగర్, చందూర్, ఘన్‌పూర్, కారేగాం, శంకోరా, షకీల్ ఫారం గ్రామాల శివారులో పంట దెబ్బతిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దారి పొడువునా స్వాగతం



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, అక్టోబరు 4: : పీసీసీ అధ్యక్షుడి హోదాలో నియామక అనంతరం తొలిసారి శుక్రవారం తన సొంత జిల్లా అయి న నిజామాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు డిచ్‌పల్లి, ధర్మారం, మాధవ నగర్‌లలో నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రోడ్లకు ఇరువైపుల ప్లెక్సీలను ఏర్పాటు చేసి మహేశ్‌కుమార్ గౌడ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ధర్మారంలో డీసీసీ ప్రతినిధి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జెండాను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. నడిపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మెట్టు శాంసను గజమాలతో అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అమ్మ తాపూర్ గంగాధర్, వాసుబాబు, ధర్మగౌడ్, సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

● ప్రజల వల్లే పదవులు

ఇందల్వాయి : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పదవి చేపట్టిన తర్వాత మొదటిసారి సొంత జిల్లాకు వచ్చిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ముందుగా చంద్రయాన్‌పల్లి వద్ద బాణాసంచా కాల్చి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన జెండా ఎగరవేసి పక్కనే ఉన్న దేవితాం డాకు వెళ్లారు. దేవితాండా వద్ద గిరిజన సాంప్రదాయ మహిళలు నృత్యాలతో పీసీసీ అధ్యక్షుడికి స్వాగతం పలికారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆకుల లలిత పుష్పగుచ్ఛం అందజేశారు. అక్కడ జెండా ఎగరవేసి టోల్గేట్ వద్దకు వచ్చిన అభిమాన నాయకుడికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆకుల లలి త, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, కరాటే రమేష్, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి, డీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, గంగాధర్ ఉన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి..

డిచ్‌పల్లి : రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు కుంట రమేశ్ రెడ్డి శుక్రవారం ధర్మారం లోని మండవ స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు జిల్లాలో సోయాబీన్ పంటను ప్రస్తుతం ఎకరానికి ఆరుక్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేవారని ప్రభుత్వం 10 క్వింటాళ్ల వరకు కొనుగోళ్లు చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మోపాల్ : మహేష్‌కుమార్‌గౌడ్ మాధవనగర్ సాయి బాబా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు సన్మానించారు. ఆలయంలో మహేష్‌కుమార్‌గౌడ్ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మాధవనగర్ వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా గిరిజన ఆదివాసీ విభాగం చైర్మన్ యాదగిరి స్వాగతం పలికారు.



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న జిల్లా మైనార్టీ నేత

భారీ బందోబస్తు మధ్య మహేశ్‌గౌడ్ పర్యటన ప్రశాంతం

ఖిల్లా, అక్టోబరు 4: పీసీసీగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ మొదటిసారి జిల్లా పర్యటనకు శుక్రవారం విచ్చేశారు. ఆయన పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావ్ నేతృత్వంలో నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకటరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆయన నిర్వహించే ర్యాలీ పొడుగునా అడుగడుగున పోలీసు సిబ్బందిని మోహరింపచేశారు. సీఐ స్థాయి నుంచి కానిస్టేబుళ్లతో పాటు మహిళా పోలీసు సిబ్బంది సుమారు 200 మంది విధులు నిర్వహించారు. పీసీసీతో పాటు రాష్ట్ర మంత్రులు సైతం జిల్లా పర్యటను రావడంతో పోలీసు శాఖ గురువారం నుంచే అప్రమత్తమైంది. రాత్రి వాహనాల తనిఖీలు ముమ్మరం చేసింది. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు సేకరించింది. ర్యాలీ నిర్వహించే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసు కుంది. ఆర్టీసీ బస్సులను, భారీ వాహనాలను దారి మళ్లించి ఆంక్షలు విధించింది. సభ జరిగే పాత కలెక్టరేట్ ప్రాంతంలో వాహనాలను క్రమబద్దీకరించింది. ప్రజలకు రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంది. సభ ప్రాంగణం వద్ద గొడవలు జరుగకుం డా మఫ్టీలో పోలీసు సిబ్బందిని విధుల్లో పెట్టారు. అనుమతి ఉన్న వారినే సభా వేదికపైకి పంపారు. వారిని సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. వెరసి పీసీసీ పర్యటన ప్రశాంతంగా ముగిసింది.



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు





మంచిప్ప ముంపు బాధితుల నిరసన

మోపాల్, అక్టోబరు 4: మండలంలోని మంచిప్ప వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు విషయంలో అధికారులు స్పష్టత ఇచ్చిన తర్వాతనే ఈ ప్రాంతంలో సర్వే చేపట్టాలని ఆ ప్రాంత గ్రామాల ప్రజలు, గిరిజనులు ఇరిగేషన్ అధికారులను అడ్డుకున్నారు. శుక్రవారం మంచిప్ప వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇరిగేషన్ అధికారులు డీఈతో పాటు మరి కొందరు అధికారులు మంచిప్ప, మంచిప్ప చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను సర్వే చేసేందుకు అధికారులు వచ్చారు. పాత డిజైన్ ప్రకారమే ఈ ప్రాంతంలో ప్రాజెక్టును నిర్మిస్తామంటేనే సర్వేచేయాలని అప్పటి వరకు ఇక్కడ సర్వే చేసేది లేదని అధికారులను ఆయా గ్రామాల ప్రజలు నిలదీశారు. గత ప్రభుత్వం రీడిజైన్ పేరుతో ఈ ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురిచేసిందని, ఇప్పుడు సర్వేల పేరుతో తమను ఇబ్బందులకు గురి చేయవద్దని ఈ ప్రాంత వాసులు అధికారులను వేడుకున్నారు. పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్టుకు సహకరిస్తామని గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా రీ డిజైన్ పేరుతో ప్రాజెక్టు నిర్మాణం చేస్తామంటే తాము ఒప్పుకోమని అన్నారు. అధికారులను గ్రామస్తులు అడ్డుకోవడంతో సర్వే చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంచిప్ప గ్రామాన్ని సందర్శించి గ్రామాలను సర్వే చేసేందుకు అధికారులు వస్తారని వారికి మీరు సహకరించాలని కోరినప్పటికీ అధికారులను గ్రామస్తులు అడ్డుకోవడంతో అధికార పార్టీ నాయకుల్లో చర్చనీయాంశమైంది.



సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, అక్టోబరు 4: డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అర్హులైన వారికి వెంటనే కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుడి సొంతింటి కల సాకారం కోసం మోదీ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన కింద దేశమంతా ఇండ్లు నిర్మిం చి అర్హులైన పేదలకు ఇస్తుంటే మన తెలంగాణ ఆవాస్‌యోజన కింద నిధులు కేటాయిస్తే వాటిని పక్కదారి పట్టించిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అన్నారు. అర్బన్‌లో కట్టిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లు శిధిలావస్థలో కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. డోర్‌లు, కిటికీలు, ఎలక్ట్రిసిటీ వస్తువులను దొంగలు అపహరించారని ప్రజాధనం కోట్ల రూపాయలు వృధా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఎంపిక అర్బన్‌లో ఎస్సీ 17 శాతం, ఎస్టీ 6 శాతం, మైనార్టీకి 12 శాతం, మిగతా కులాల వారికి సమానంగా ఎంపిక చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వం జీవో తుంగలో తొక్కి తన ఇష్టమచ్చినట్లు పార్టీ నాయకులకు మైనార్టీల ఓటు బ్యాంకు కోసం 43 శాతం లిస్ట్ ఎంపిక చేసి మిగతా వర్గాలకు అన్యాయం చేశారని అన్నారు. ప్రభుత్వం ఇస్తా నన్న ఇందిరమ్మ ఇండ్ల కింద అర్బన్ నియోజకవర్గానికి 7500 ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్న వారికి కట్టుకోవడానికి 5లక్షల ఆర్థిక సహాయం కూడా అందజేయాలని డిమాండ్ చేశారు.



ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బైక్‌ను ఢీకొట్టిన హార్వేస్టర్.. బీజేపీ నాయకుడి మృతి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 4: మండలకేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు చింత గణేష్ (49) శుక్రవారం ఉప్లూర్ అనుబంధగ్రామం దమ్మన్నపేట్‌వద్ద రోడ్డుప్రమాదంలో మరణించారు. తన బైక్‌పై ఉప్లూర్ గ్రామానికి వెళ్లి కమ్మర్‌పల్లికి తిరిగివస్తుండగా దమ్మన్నపేట వద్ద వ్యవసాయ భూముల నుంచి రోడ్డుఎక్కుతున్న హార్వేస్టర్ బలంగా ఢీకొట్టడంతో కిందపడిపోయిన చింత గణేష్ తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే గణేష్ మృతి చెందినట్లు అక్కడ వైద్యులు నిర్ధారించారు. పోలీసులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి శవపంచనామా జరిపి శవాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సంఘటన స్థలం నుంచి రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీ స్టేషన్‌కు తరలించి కేసుదర్యాప్తు చేస్తున్నట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్‌రెడ్డి తెలిపారు. మృతుడు చింత గణేష్ మొన్నటివరకు బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండలశాఖ అధ్యక్షుడిగా కొనసాగారు. వారం రోజుల క్రితమే బీఆర్ఎస్‌ను వీడి నిజామాబాద్ ఎంపీ, బాల్కొండ బీజేపీ ఇన్‌చార్జ్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. మృతునికి భార్య లక్ష్మీ, కూతురు కీర్తన, కొడుకు కార్తికేయ ఉన్నారు.

ముగిసిన సెర్చ్ కమిటీ సమావేశం

డిచ్‌పల్లి, అక్టోబరు 4: తెలంగాణ విశ్వవిద్యాలయంకు త్వరలోనే నూతన వీసీ రానున్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో సెర్చ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీ సభ్యులు యూజీసీ నామినీ హిమాచల్ ప్రదేశ్‌లోని వైస్ పార్మర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఉపకులపతి రాజేశ్వర్ సింగ్ చందేల్, యూనివర్సిటీ వీసీ నామినీ ఉస్మానియా రిటైర్డ్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ పాల్గొన్నారు. వీసీ పోస్టుకు వచ్చిన 130కి పైగా వచ్చిన దరఖాస్తుల నుంచి ముగ్గురు పేర్లను ఎంపిక చేసి ఆ జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఎంపిక చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపనుంది. గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత టీయూకు నూతన వీసీ రానున్నారు.





సంస్థ పేరుతో వసూళ్లపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 4: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వీ స్వచ్ఛంద సేవాసంస్థ పేరుతో పలువురు డబ్బులను వసూలు చేస్తున్నారని ఎస్సై గంగాధర్‌కు సంస్థ సభ్యులు ఫిర్యాదు చేశారు. పది రోజులుగా ఆర్మూర్ కేంద్రంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో పలు గ్రామాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారని, నవీపేట మండలం నాళేశ్వరంలో తపస్వీ స్వచ్ఛంద సేవాసంస్థ పేరుతో వసూలు చేసినట్టు తెలిసిందని, దీంతో ప్రణాళిక రచించి వసూళ్ళకు పాల్పడుతున్న ముఠాను పట్టుకొని స్థానిక స్టేషన్‌లో అప్పగించినట్టు సంస్థసభ్యులు తెలిపారు. విచారణ చేస్తున్నట్టు ఎస్సై గంగాధర్ తెలి పారు.

చికిత్స పొందుతూ ఎంపీడీవో మృతి

ముప్కాల్, అక్టోబరు 4: ముప్కాల్ మండల ఎంపీడీవో మహమ్మద్ ముజాఫారోద్దిన్ (58) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.... గత శని, ఆదివారాలు సెలవు లుండడంతో ఆదిలాబాద్ వెళ్లారు. ఇంటి నుంచి వచ్చిన ఆయన సోమవారం ముప్కాల్ బస్సు దిగుతుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలు కాగా మొదట నిర్మల్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్ళారు. కోమాలో ఉన్న ఆయన సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతదేహాన్ని ఆర్మూర్‌లో పోస్టుమార్టం నిర్వహించి ఆదిలాబాద్‌కు తరలించినట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు 4: మండలంలోని బెజ్జోర గ్రామంలో కప్పలవాగు నుంచి గురువారం అర్ధరాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని భీమ్‌గల్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక లారీని తహసీల్దార్‌కు అప్పజెప్పినట్టు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు. దీనిపై తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్‌ను వివరణ కోరగా ఎటువంటి అనుమతులు లేకుండా కప్పలవాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీని తదుపరి చర్యలకు భూగర్భగనుల శాఖ అధి కారులకు అప్పజెప్పినట్టు తెలిపారు.

మొరం టిప్పర్..

నవీపేట, అక్టోబరు 4 : నిజామాబాద్ మండలం మల్కాపూర్ శివారులో అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. మల్కాపూర్ నుంచి నవీపేట వైపు మొరం టిప్పర్ తరలివెళ్తుండగా సంబంధిత వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. .

9న మహాలక్ష్మి ట్రస్టు ఎన్నిక

బోధన్‌రూరల్, అక్టోబరు 4: బోధన్ పట్టణ మహలక్ష్మి ట్రస్టు గ్రామాభివృద్ధి కమిటీ నూతన కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నూతన కమిటీ ఏర్పాటుకు శుక్రవారం మహాలక్ష్మి కల్యాణ మండపంలో 66 కులసంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యులు లోలశంకర్ ఓటు సభ్యులకు నియామవళిని వివరించారు. గ్రామ కమిటీలో 66మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ నెల 5వ తేదిన నామినేషన్‌లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 6వ తేదిన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 9వ తేదిన మహలక్ష్మి ట్రస్టు ఎన్నికలు ఉంటాయన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, శంకర్, బత్తుల సాయిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బోధన పద్ధతులపై శిక్షణ

పెర్కిట్, అక్టోబరు 4: ఆర్మూర్ మండల ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యాపకులకు బోధన పద్ధతులపై మేళకువల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భారత్‌చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్య ప్రవీన్‌పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, బాషిత సుందర్, మల్లేష్, నలంద సాగర్, మానస గణేష్, వంశీ, ప్రజ్ఞ, శశాంక్, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

కమ్మర్‌పల్లి, అక్టోబరు 4: దోమలు వ్యాపించకుండా పరసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని నాగాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి, కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గ్రామంలో చేపట్టిన ప్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్లలో నిలువ ఉంచిన నీటిని పరిశీలించి అవగాహన కల్పించారు. ఎంపీడీవో వెంట వైద్య ఆరోగ్యసిబ్బంది, ఆశా వర్కర్‌లు, గ్రామపంచాయితీ కార్యదర్శి కాందేశ్ సంధ్య పంచాయతీ తదితరులు ఉన్నారు.

ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సూపరిండెంట్‌గా రవీందర్

మెండోర, అక్టోబరు 4: మండలంలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డివిజన్-1 సూపరిండెంట్‌గా అమరగొని రవీందర్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ చక్రపాణి, డిఏవో రాజలింగంగౌడ్, రిటైర్డు సూపరిండెంట్ జాన్ సుధాకర్‌లు సన్మానించారు. కార్యక్రమంలో డీఈఈలు గణేష్, సుకుమార్, గంగాభూషణ్, రఘుపతి, ఉద్యోగులు, శ్రీనివాస్ తదిరతులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 4: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారినిగా దర్శనమిచ్చారు. పార్వతీదేవి రూపంగా భక్తులు ఈరోజున దుర్గాదేవి రూపంలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి దేవాలయాలు, మంటపాలలో విశేషపూజలు, అర్చనలు జరిపారు. బ్రహ్మచారినిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు శాంతి, శ్రేయస్సు, మోక్షం ఇవ్వాలని కోరుకుంటూ పూజించారు. అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాన్ని సమర్పించారు. పలు ఆలయాలు, మంటపాలలో సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. జిల్లా కేంద్రంలోని తుల్జాభవాని, ఏడుపాయల దుర్గాభవాని, వాసవి కన్యకాపరమేశ్వరి, దేవిరోడ్‌లోని దేవిమాత ఆలయం, మమ్మదేవి నగర్‌లోని మమ్మదేవి, నీలకంఠేశ్వర ఆలయంలోని పార్వతీ దేవి, పెద్దమ్మ దేవాలయం, లలితానగర్‌లోని లలితా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు సాగాయి.

డిచ్‌పల్లి: మండలంలోని శివాలయంతో పాటు రైల్వేస్టేషన్ ప్రాంతంలో నవరాత్రులు దుర్గా మాతాలను ప్రత్యేకంగా షెడ్డులను ఏర్పాటు చేసి విగ్రహల చుట్టూ ప్రత్యేక అలంకరణ ఏర్పాటు చేశారు. మండలంలోని ఘన్‌పూర్, ధర్మారం, మిట్టపల్లి గ్రామాల్లో దుర్గామాత విగ్రహలు ఏర్పాటు చేసి సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాత్రి సమయాల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపాల నిర్వాహకులకు రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డైరెక్టర్ సుచరితరెడ్డి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సుచరితరెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తున్న చీరలను దుర్గాదేవి మండపాల వద్దకు బీజేపీ నాయకులు తీసుకువెళ్ళి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: దుర్గామాత మండపంలో ప్రత్యేక కార్యక్రమాలు శుక్రవారం రెండోరోజు మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగ ఉత్సకమిటీ సభ్యులు దుర్గామాతను కరెన్సీ ఓట్లతో అలంకరించారు. గ్రామస్తులు దేవి మండపంలో అర్చకులు భానుప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులు, ప్రజలు మండపాల్లో భక్తిశ్రద్ధలతో అంగరంగా వైభవంగా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు శేఖర్, భక్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్‌కల్చరల్, అక్టోబరు 4: తెలంగాణ ఆడపడుచులు ఎంతో సం బురంగా జరుపుకునే బతుకమ్మ పం డుగ జిల్లా వ్యాప్తంగా అంబరాన్ని అంటుతున్నాయి. బతుకమ్మ ఉత్స వాలు శుక్రవారానికి మూడోరోజుకు చేరుకోవడంతో మహిళలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వాడ వాడల్లో, ఆలయాల్లో బతుకమ్మలను వివిధరకాల పూలతో పేర్చి తోటి మ హిళలతో పాటలు పాడుతూ బతుక మ్మ ఆడుతున్నారు. బతుకమ్మకు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించి ఆట పాటలతో సందడి చేస్తున్నారు. బతుకమ్మను మూడుఅంతరాలలో పేర్చి అందులో గౌరమ్మను ఉంచి పూజలు చేసి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించుకున్నారు. బతుకమ్మ వేడుకల్లో మూడో రోజున ముద్దపప్పు బతుకమ్మ వేడుకల్లో భాగంగా నైవేద్యంగా ముద్దపప్పు, పాలు, బెల్లంతో చేసిన పిండి వంటకాలను గౌరమ్మకు సమర్పించుకున్నారు. మహిళలు ఒకరినొకరు పసుపు బొట్లు ఇచ్చుకున్నారు. అనంతరం దగ్గరలోని కొలనులో నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని నగరేశ్వర ఆలయం, పెద్ద రాంమందిర్, అయోధ్యరామాలయం, హనుమాన్ జంక్షన్, నీలకంఠేశ్వర ఆలయం, జెండా బాలాజీ మందిర్ ఆలయాల్లో వేడుకలు సాగాయి.

కొనసాగుతున్న డిజిటల్ సర్వే

భీమ్‌గల్, అక్టోబరు 4: భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని 7వార్డును పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి చేపట్టిన డిజిటల్ సర్వే శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్ ఆధ్వర్యంలో 7వార్డుల్లోని ప్రతీ ఇంటికి క్షేత్రస్థాయిలో వెళ్ళి కుటుంబ వివరాలను సేకరించారు. సర్వే ద్వారా డిజిటల్ కార్డులో నమోదు చేయబడుతాయని ఎంపీడీవో తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీజడ్పీటీసీ

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 4: ఆర్మూర్ మాజీ జడ్పీటీసీసభ్యుడు ఉప్పు రణధీర్ శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజామాబాద్‌లోని మాదవనగర్‌లో పీసీసీ అధ్యక్షుడును కలిసిన ఉప్పురణధీర్ పార్టీలో చేరగా, కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.